క్లుప్తంగా

విత్తనాలు అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు

అమరావతి: ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే పత్తి, మిర్చి, ఇతర పంటల విత్తనాలను అధిక రేట్లకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి అహ్మద్ శనివారం హెచ్చరించారు. స్టాకు రిజిస్టర్, బిల్లు పుస్తకాలను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. కలుపు మందు తట్టుకునే బీటీ విత్తనాల అమ్మకానికి అనుమతి లేదన్నారు. ఈ విత్తనాలను అమ్మకాలు జరిపితే చర్యలు తప్పవన్నారు. విత్తనాల, ఎరువుల స్టాకు పట్టికను ప్రతి రోజు బోర్డులో రాయాలని సూచించారు. రసీదులు లేకుండా విత్తనాలను రైతులు కొనుగోలు చేయవద్దని కోరారు.

గ్రంథాలయంలో కూచిపూడి నృత్య శిక్షణ



అమరావతి: అమరావతి శాఖా గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరంలో చిత్రలేఖనం, వ్యాసరచన, యోగా, కూచిపూడి నృత్యంపై శిక్షణనిచ్చారు. కథలు చెప్పటం, డ్రాయింగ్, పెయింటింగ్‌లో శిక్షణ ఇచ్చారు. కూచిపూడి నృత్యగురువు ఎం.నాగచైతన్య విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక గ్రంథాలయాధికారి వెంకాయమ్మ పాల్గొన్నారు.

144 సెక్షన్ అతిక్రమిస్తే కఠిన చర్యలు

సత్తెనపల్లి: పట్టణంలో 144 సెక్షన్ అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని పట్టణ సీఐ పోలూరి శ్రీనివాసరావు హెచ్చరించారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం చోటు చేసుకుంటున్న అల్లర్ల నేపథ్యంలో జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చేపట్టిన 144 సెక్షన్ శనివారం 4వ రోజుకు చేరింది. పట్టణంలో పాలు, కూరగాయలు, మెడికల్ షాపులు మినహా మిగిలిన అన్ని దుకాణాలను మూసివేశారు. సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ అనవసరంగా రోడ్లపై తిరగవద్దని, నలుగురికి మించి ఒకే చోట గుమ్మి కూడినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. నిబంధనలు అతిక్రమించిన పలువురిపై కేసులు నమోదు చేశారు. ఆయన వెంట ఎస్‌ఐలు ఎం.సంధ్యారాణి, ఎం.సత్యనారాయణ ఉన్నారు.

అభివృద్ధి ఫలాలు ప్రతి గ్రామానికి చేరాలి

ఎంపీపీ అనూరాధ

నకరికల్లు: అధికారులు సమన్వయంతో పని చేసి మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని ఎంపీపీ మేచారపు అనూరాధ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లోని మారుమూల ప్రాంతాల్లోని ప్రజలకు సంక్షేమ పథకాల ప్రయోజనాలు చేరాలన్నారు. ముందుగా శాఖలవారీగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఆయాశాఖల అధికారులు వివరించారు. ఎంపీడీఓ డి.జయమణి శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు, ఎలక్ట్రికల్ ఏఈ నాగ సురేష్‌బాబు, పంచాయతీరాజ్ ఏఈ సురేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రత్నబాబు, ఏపీఓ సుదర్శనరావు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

ముప్పాళ్ల: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. మండలంలోని గోళ్లపాడు సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొన్న ప్రమాదంలో నకరికల్లు మండలం చేజర్లకు చెందిన షేక్ షరీఫ్(24) గాయపడి నరసరావుపేటలోని ఏరియా వైద్యశాలలో ప్రాథమిక చికిత్స పొందాడు. అనంతరం మెరుగైన చికిత్స కోసం ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పి.హజరత్తయ్య తెలిపారు.

డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ



ముప్పాళ్ల: జాతీయ డెంగీ నివారణ కార్యక్రమంలో భాగంగా ముప్పాళ్లలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో సత్తెనపల్లి మలేరియా సబ్‌యూనిట్ అధికారి డి.చంద్రశేఖర్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడాలని, ఇంట్లోని వ్యర్థాలను కాల్వలో వేయరాదని, జ్వరం వస్తే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలని చెప్పారు. ర్యాలీలో సూపర్‌వైజర్లు పీటర్‌డేనియల్ పాల్గొన్నారు.

వ్యాధుల కాలం .. ఆరోగ్యం భద్రం



ఇంటింటికీ అవగాహన కల్పిస్తున్న మలేరియా, వైద్య సిబ్బంది

- వాతావరణ మార్పులతో విషజ్వరాల వ్యాప్తికి అవకాశం
- డెంగీ, జ్వరాల నివారణకు వైద్యశాఖ చర్యలు
- దోమల నివారణపై దృష్టి

సత్తెనపల్లి: వేసవి కాలం .. పగటిపూట ఠారెత్తిస్తున్న ఎండలు. సాయంత్రం మబ్బులు పట్టిన ఆకాశం. అడపాదడపా చిరుజల్లులు. ఈ ఆకస్మిక వాతావరణ మార్పులతో విష జ్వరాలు ప్రబలే ప్రమాదం ఎక్కువ. ఈ కాలంలోనే డెంగీ సోకే అవకాశం ఉంది. అందుకే వైద్య నిపుణులు ఆరోగ్య భద్రత ముఖ్యమని హెచ్చరిస్తున్నారు. చిన్నచిన్న జాగ్రత్తలతో సీజనల్ రోగాలను సమర్థంగా ఎదుర్కోవచ్చని ధైర్యం చెబుతున్నారు. జాతీయ డెంగీ నివారణ వారోత్సవాల్లో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ, మలేరియా సిబ్బంది దోమల నియంత్రణపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నారు.

ఇంటింటికి వైద్యం...

నియోజకవర్గంలో సత్తెనపల్లి ఏరియా వైద్యశాలతో పాటు మూడు అర్బన్ హెల్త్ కేంద్రాలు, ఐదు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు సచివాలయాల పరిధిలో వెల్‌నెస్ కేంద్రాల ద్వారా ప్రభుత్వం ప్రతి ఇంటికి వైద్య సేవలు అందిస్తోంది. గత నెలలో తీవ్ర ఉష్ణోగ్రతలు నమోదు కాగా ఈ నెలలో అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. అక్కడక్కడ వర్షపు నీరు నిలిచి దోమలు పెరిగి పలు రకాల జ్వరాలతో ప్రజలు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. వైద్య సిబ్బంది రోగులకు ముందుగానే ర్యాపిడ్ పరీక్షలు చేస్తున్నారు. డెంగీ నిర్ధారణ అయితే వెంటనే రక్త కణాల పరీక్షలు జరిపి, పరిస్థితి తీవ్రం కాకుండా చర్యలు తీసుకుంటున్నారు. ప్లేట్‌లెట్స్ తక్కువగా ఉన్న రోగులకు రక్తం, ప్లేట్‌లెట్స్ కోసం రిఫర్ చేస్తున్నారు.

డెంగీపై అప్రమత్తం...

ఈ సీజన్‌లో ఎక్కువగా డెంగీ జ్వరాలు ప్రబలే అవకాశం ఉంది. దీంతో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది జాతీయ డెంగీ నివారణ వారోత్సవాల పేరిట ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఏడిస్ దోమ కాటు వల్ల డెంగీ సోకుతుంది. ఈ దోమ నలుపు, తెలుపు చారలతో ఉంటుంది. అందుకే దీన్ని పులి దోమ అని కూడా అంటారు. ఈ దోమ శుభ్రమైన నిల్వ నీటిలోనే గుడ్లు పెడుతుంది. సూర్యోదయానికి రెండు గంటల ముందు రెండు గంటల తర్వాత మాత్రమే ఎక్కువగా కుడుతుంది. ఈ దోమ జీవిత కాలం రెండు వారాలు. మూడుసార్లు మాత్రమే గుడ్లు పెడుతుంది. ఇంట్లోని బట్టలు, పరుపులు, కర్టెన్స్ వెనక ఎక్కువగా దాక్కుని ఉంటాయి.

విశ్రాంతి, ప్రాథమిక చికిత్స...

డెంగీ, విష జ్వరాల చికిత్సకు నిర్దిష్టమైన మందులు లేవు. జ్వరం ఉన్నప్పుడు ఎక్కువ విశ్రాంతి, ద్రవ పదార్థాలు తీసుకోవాలి. మూత్ర విసర్జన తగ్గడం, నోరు, పెదవులు పొడిబారడం, నీరసం, గందరగోళం, జలుబు, చేతులు, కాళ్లు బిగుసుకు పోవడం వంటి లక్షణాలు ఉంటే తక్షణమే వైద్యుడిని సంప్రదించాలి. వైద్యుల సూచన లేకుండా మందులు వాడరాదు.

లక్షణాలు...

- అధిక జ్వరం(105 డిగ్రీలు)
- తీవ్రమైన తలనొప్పి, కళ్లు, కండరాల నొప్పి
- అలసట, వికారం, వాంతులు,అతిసారం
- చర్మంపై దద్దుర్లు (జ్వరం వచ్చిన 2–5 రోజుల తర్వాత)
- చిగుళ్లు, ముక్కు నుంచి చిన్నపాటి రక్తస్రావం

ముందస్తు నియంత్రణ మేలు..

- డెంగీ దోమలు కుట్టకుండా ఉదయం, సాయంత్రం సమయాల్లో శరీరం మొత్తం గుడ్డతో కప్పుకోవాలి. చిన్నపిల్లల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి.
- దోమతెరలు, జాలీలు, దోమలను చంపే క్రీములు, స్ప్రేలు వాడాలి.
- రసాయనాలతో పొగ పెట్టడం, ఇళ్లల్లో మందులు చల్లడం చేయాలి.
- ఇంటిలో, ఇంటి పరిసరాల్లో రోజుల తరబడి నిల్వ నీరు లేకుండా చూడాలి.
- పనికిరాని సీసాలు, డబ్బాలు, టైర్లు, వాటర్ కూలర్‌లు వంటి వాటిలో నీరు లేకుండా చూసుకోవాలి.

పచ్చిరొట్టతో నేల సారవంతం

- మొక్కలకు అవసరమైన పోషకాల లభ్యత
- సాగుకు సరైన సమయం

సత్తెనపల్లి: వరి సాగుకు ముందు పొలాల్లో పచ్చిరొట్ట వేయడం నేలకు ఎంతో మేలు చేస్తుంది. భూముల్లో సేంద్రీయ కర్బణం పెరిగి పంట దిగుబడులు పెంచుకోవచ్చు. అధిక మోతాదులో వేసే రసాయనక ఎరువులతో భూములు సారం కోల్పోతాయి. పచ్చి రొట్ట పైర్ల సాగుతో పెట్టుబడులు తగ్గడమే కాకుండా పంట దిగుబడులను పెంచు కోవచ్చని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. భూమిని సారవంతం చేసుకోవడానికి వరి పంట వేసే పొలంలో పచ్చిరొట్ట ఎరువులైన జీలుగలు, పిల్లి పెసర, జనుము పంటలను వేసి పూత సమయంలో కలియ దున్నడం వలన నేల సారవంతమై అధిక దిగుబడులు సాధించడానికి దోహదం చేస్తాయి. సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలోని సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాలకు ఇప్పటికే ఈ విత్తనాలు వచ్చాయి. విత్తనాలు కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లోని గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా డి- క్రీష్ దరఖాస్తులో రిజిస్ట్రేషన్ చేయించుకొని రైతు వాటా నగదు చెల్లిస్తే ఏపీ సీడ్స్ ద్వారా నాణ్యమైన విత్తనాలు పొందవచ్చు. సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాలకు జీలుగా 948 క్వింటాళ్లు, జనుము 574 క్వింటాళ్లు, పిల్లి పెసర 581 క్వింటాళ్లు, మొత్తం 2,103 క్వింటాళ్లు విత్తనాలు అవసరమని ప్రతి పాదనలు పంపారు. జీలుగా కిలో రూ.88 అమ్ముతుండగా 50 శాతం సబ్సిడీతో రూ.44 కు, పిల్లి పెసర కిలో రూ.134 ఉండగా 50 శాతం సబ్సిడీతో రూ.67కు, జనుము కిలో రూ.88 ఉండగా 50 శాతం సబ్సిడీతో రూ.44 రైతులకు అందజే యనున్నారు.



సాగు చేసిన జీలుగ పంట

పెట్టుబడి వ్యయం తగ్గుతుంది....

జనుము, జీలుగ, పిల్లి పెసర తదితర రకాలను ఖరీఫ్, రబీకి మధ్య సాగు చేసుకోవాలి. వీటిని పూత దశ వరకు పెంచి ఖరీఫ్ పంట వేసేముందు భూమిలో కలియ దున్నాలి. పచ్చిరొట్ట పైర్లలో స్థూలపోషకాలు అధికంగా ఉంటాయి. నత్రజని 1.8 నుంచి 3.5 శాతం, భాస్వరం 0.1 నుంచి 0.3 శాతం , పొటాషియం 0.5 నుంచి 2 శాతం వరకు ఉంటాయి. స్థూల పోషకాలతో పాటు సూక్ష్మ పోషకాలు భూమికి లభిస్తాయి. పంటల ఎదుగుదలకు ఈ మూడు పోషకాలు ఎంతో అవసరం. భూమి లోపల నిక్షిప్తమైన పోషకాలను ఈ పైర్లు వెలికి తీస్తాయి. పచ్చిరొట్ట సాగుతో 30 శాతం రసాయన ఎరువుల వినియోగం తగ్గుతుంది. రైతులు ఆర్థికంగా లాభ పడటానికి పచ్చిరొట్ట పైర్లు దోహదం చేస్తాయి. ఎరువుల ధరలు ఆకాశం అంటుతున్న ప్రస్తుత తరుణంలో వీటి సాగుతో పెట్టుబడి వ్యయం తగ్గుతుంది.

విత్తన శుద్ధితో అధిక దిగుబడులు

రెంటచింతల: ఖరీఫ్ సీజన్‌లో రైతులు విత్తన శుద్ధి చేయడం వలన చీడపీడల నుంచి పంటలను రక్షించుకోవడం వలన అధిక దిగుబడులను సాధించి ఎక్కువ ఆదాయాన్ని పొందవచ్చనని మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి అన్నారు. శనివారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పది లీటర్ల నీటిలో 1.5 కిలోల ఉప్పు కలిపి ఎంపిక చేసుకున్న వరి విత్తనాలు పోయగా పైకి తేలిన తాలు విత్తనాలను తీసివేసి నీటి అడుగున మునిగి ఉన్న గట్టి విత్తనాలు నారు పోసుకోవడానికి వాడుకోవాలని సూచించారు. కిలో వరి విత్తనానికి ఒక లీటరు నీటిలో 2.5 గ్రాముల కార్బండజిమ్ కలపి 24 గంటలు నానబెట్టిన అనంతరం మరో 20 గంటల నుంచి 24 గంటల పాటు మంచినీటిలో విత్తనాన్ని ఉంచి తరువాత నారు మడులలో చల్లుకోవాలని కోరారు. విత్తనాల ద్వారా సంక్రమించే తెగుళ్ల నివారణ కోసం కిలో విత్తనానికి మూడు గ్రాముల థైరమ్ లేదా కాప్టాన్ మందును కలపి విత్తన శుద్ధి చేసుకోవాలని సూచించారు. నారు మడిలో ఆకు తినే పురుగులు, ఉల్లికోడు, మొవ్వ పురుగు సోకకుండా ఉండటానికి మొలకెత్తిన విత్తనాన్ని నారు మడిలో చల్లే ముందు 0.2 శాతం క్లోరిప్రేరిఫాస్ ద్రావణంలో నానపెట్టి చల్లు కోవాలని వివరించారు. కిలో పత్తి విత్తనాన్ని 8 గ్రాముల ట్రైకో డెర్మావిరిడితో, కిలో మిరప విత్తనాన్ని 8 నుంచి 10 ఎంఎల్ గ్రామల ద్రావణంలో విత్తన శుద్ధిచేయడం మంచిదన్నారు. పత్తి చుట్టూ అంతరపంటగా 4 సాళ్లకు ఒక సాలుకు కంది, మినప, పెసర సాగుచేసు కోవడం వలన ఎంతో మేలు జరుగుతుందని వివరించారు.

నిర్దేశిత లక్ష్యాల ప్రకారం వ్యాక్సినేషన్

టీబీ కంట్రోల్ ప్రోగ్రాం రాష్ట్ర జేడీ డాక్టర్ రమేష్

గుంటూరు మెడికల్: టీబీ రాకుండా పెద్దలకు ప్రభుత్వం ఉచితంగా వ్యాక్సిన్లు అందిస్తున్న దృష్ట్యా వైద్య సిబ్బంది నిర్దేశించిన లక్ష్యాల ప్రకారం అందరికీ వ్యాక్సిన్లు వేయించాలని క్షయ నియంత్రణ కార్యక్రమం రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ టి.రమేష్ అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖధికారి సమావేశ మందిరంలో వైద్యాధికారులు, స్పెషలిస్ట్ డాక్టర్లతో శనివారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి అధ్యక్షతన సమీక్ష నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ రమేష్ మాట్లాడుతూ అడల్ట్ బీసీజీ వాక్సినేషన్‌లో గుంటూరు జిల్లా వెనుకబడటానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. వ్యాక్సిన్ చేయించుకున్న ప్రతి ఒక్కరిని మూడు నెలలకు ఒకసారి మూడు సంవత్సరాల పాటు ఫాలో అప్ చేయాలని సూచించారు. వ్యాక్సిన్ వేయించుకున్న వారి వివరాలను ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని చెప్పారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి మాట్లాడుతూ గర్భిణుల నమోదు తక్కువగా ఉన్న ఆరోగ్య కేంద్రాల వారు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని కోరారు. ఆరోగ్య కేంద్రాల్లో కాన్పులు చేసి వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. కాన్పుల కోసం 108 వాహనాల సేవలను వినియోగించుకోవాలని చెప్పారు. ట్యూబెక్టమీ శిక్షణ పొందిన డాక్టర్స్ వెంటనే తాము పనిచేస్తున్న ఆరోగ్య కేంద్రాల్లో ఆపరేషన్లు ప్రారంభించాలని చెప్పారు. ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులు ఆన్‌లైన్‌లో అప్‌లోడు చేయాలని, అందుకోసం ఆరోగ్యకేంద్రాల్లో పనిచేస్తున్న పురుష ఆరోగ్య కార్యకర్తల సేవలు ఉపయోగించుకోవాలని సూచించారు. జిల్లా టీబీ అధికారి డాక్టర్ దాసరి శ్రీనివాసులు, ఎన్‌సీడీ ప్రొగ్రామ్ జిల్లా అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు, డీఐఓ డాక్టర్ కె.వి.సుబ్బరాజు, ఎన్‌హెచ్‌ఎం డీపీఎంఓ డాక్టర్ చుక్కా రత్నమన్మోహన్, డెప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఇ.అన్నపూర్ణ, జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ రమేష్, పక్కన డాక్టర్ విజయలక్ష్మి

21న ఆలయ స్టాల్స్ నిర్వహణ హక్కుల వేలం

అచ్చంపేట: మండలంలోని మాదిపాడు పంచాయతీ పరిధిలోని అటవీలో స్వయంభు సత్తెమ్మతల్లి దేవాలయం వద్ద స్టాల్స్ నిర్వహణ హక్కుల కోసం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు దేవదాయ శాఖ కార్యనిర్వహణాధికారి గాదె రామకోటిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొబ్బరికాయలు, పూజా ద్రవ్యములు అమ్మకునేందుకు ధరవత్తుగా రూ.50 వేలు, క్యాంటిన్, కూల్‌డ్రింక్స్ అమ్ముకునేందుకు రూ.50 వేలు, కొబ్బరి చిప్పలు, భక్తులు అమ్మవారికి సమర్పించిన చీరెలు, జాకెట్ ముక్కలు పోగు చేసుకునే హక్కుకు రూ.30 వేలు, టెంట్ సామాన్లు, వంటసామగ్రి, గ్యాస్ సిలెండర్స్, వంటచెరుకు అద్దెకు ఇచ్చుకునేందుకు రూ.30 వేలు, అమ్మ ఫొటోలు, చేతికికట్టుకునేదారాలు, అమ్మవారి జెండాలు, ఫ్రూట్స్ అమ్ముకునేందుకు రూ.20 వేలు, భక్తులు సమర్పించిన తలనీలాలు పోగుచేసుకునేందుకు రూ.20 వేలు, ప్రసాదాలు విక్రయించుకునేందుకు రూ.20 వేలు ముందుగా ధరఖావత్తు సొమ్ముగా చెల్లించవలసి ఉంటుందన్నారు. పాటలో పాల్గొన దలచినవారు ధరావత్తు సొమ్మును నగదు రూపములో తీసుకుని రావలసి ఉంటుందన్నారు. వివరాలకు 9182960378 సంప్రదించాలని కోరారు.

అలరించిన నృసింహ గానవైభవం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై శనివారం చింతలపాటి రమామహేశ్వరి బృందంతో నృసింహ గానవైభవం జరిగింది. బెల్లంకొండ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరగ్గా, ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించారు. గాయనీమణులు చింతలపాటి రమామహేశ్వరి, ఇమ్మడి అంజనీదేవి, పావని, నాగలక్ష్మి బృందం హంసధ్వని రాగంలో తిరుమల గిరిరాయ, గంభీరనట రాగంలో శరణు శరణు, కళ్యాణి రాగంలో నవనారసింహ, సావేరి రాగంలో జయము జయము అంటూ పలు నృసింహ కీర్తనలను ఆలపించారు. ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. వయోలిన్‌పై పాలపర్తి ఆంజనేయులు, తబలాపై బాలాజీ వాద్య సహకారం అందించారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని మంగళగిరి డోలాస్‌నగర్ రైలు పట్టాలపై రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యకి (25) అక్కడిక్కడే మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. రైల్వే జీఆర్పీ ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం గుర్తుతెలియని వ్యక్తి రైలు పట్టాలు దాటుతున్న సమయంలో రైలు ఢీకొనడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. వివరాలు తెలిసిన వారు జీఆర్పీ ఎస్‌ఐ రమేష్‌బాబు 9908383300 నంబరుకు సమాచారం తెలియజేయాలని కోరారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు

బెల్లంకొండ: మండంలోని పలు గ్రామాలలో శనివారం మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవాలను భక్తులు వైభవంగా నిర్వహించారు. మండలంలోని బెల్లంకొండ, వన్నాయపాలెం, చంద్రాజుపాలెం, వెంకటాయపాలెం గ్రామాలలో భక్తులు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం గ్రామాల పుర వీధులలో బ్రహ్మంగారి జెండా ఊరేగింపు కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

గ్రామాల్లో విస్తృత తనిఖీలు

గురజాల: సార్వత్రిక ఎన్నికల ఘర్షణల నేపథ్యంలో పోలీసులు శనివారం విస్తృత తనిఖీలు చేపట్టారు. మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీ పరిధిలోని గురజాల, జంగమహేశ్వరపురం గ్రామాల్లో ప్రతి ఇంటిని, ప్రతి ఖాళీ స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఎటువంటి అల్లర్లు జరగకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలని సీఐ టి.బాలకృష్ణ కోరారు.

భక్తిశ్రద్ధలతో వాసవీ మాత జన్మదిన వేడుకలు



వాసవీమాతకు పూజలు చేస్తున్న వాసవి మణికంఠ క్లబ్ బాధ్యులు



ప్రత్యేక అలంకరణలో వాసవీ మాత

సత్తెనపల్లి: వాసవి మాత జన్మదినం సందర్భంగా స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవి మాత అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వాసవి ఇంటర్నేషనల్ అనుబంధ సంస్థ వి204 ఏ వాసవి మణికంఠ క్లబ్ తరపున అమ్మవారికి పూలదండ, చీర, పసుపు, కుంకుమ సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు వనమా నాగేశ్వరరావు, సెక్రెటరీ పెండ్యాల సాంబశివరావు, ట్రెజరర్ సూరే శ్రీనివాసరావు, జాయింట్ సెక్రెటరీ అనుములశెట్టి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు కొప్పురావు కాశి పాల్గొన్నారు.

అచ్చంపేటలో..

అచ్చంపేట: ఆర్యవైశ్యుల ఆరాధ్య దేవత శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జన్మదినోత్సవం స్థానిక వాసవీమాత దేవాలయంలో శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆర్య వైశ్య మహిళా విభాగం ఆధ్వర్యంలో సహస్రనామార్చనలు నిర్వహించారు. అనంతరం అన్నదాన సమారాధన నిర్వహించారు.

క్రోసూరులో..

క్రోసూరు: క్రోసూరులోని వాసవీకన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శనివారం అమ్మవారి జన్మదిన వేడుకలు ఆర్యవైశ్య భక్తులు, మహిళా భక్తులు ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కన్యలు అమ్మవారి ప్రత్యేక పూజలు, భక్తి పాటలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారి ఆలయంలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.



ప్రత్యేక అలంకరణలో వాసవీ అమ్మవారు

స్నేహానికన్న మిన్న లోకాన లేదురా!



జగ్గాపురం జెడ్పీ హైస్కూల్లో 1987 నుంచి 1992 వరకు చదివిన విద్యార్థులు

జగ్గాపురం జెడ్పీహైస్కూల్లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

యడ్లపాడు: తాము చదివిన పాఠశాలలో సుమారు మూడున్నర దశాబ్దాల తర్వాత కలుసుకున్నారు. ఆత్మీయతతో కూడిన పలకరింపులు, అనుబంధాలు పంచే పరిచయాలు, చిన్ననాటి మధురస్మృతులను నెమరువేసుకుంటూ వారు రోజంతా ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. యడ్లపాడు మండలంలోని జగ్గాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1987లో ఆరో తరగతిలో చేరి 1992లో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యావిధానంలో నాడు-నేడు వచ్చిన మార్పులు-వసతులు, ఉపాధ్యాయులు-విద్యార్థుల ప్రవర్తన తీరుపై విశ్రాంత హెచ్‌ఎం అబ్బరాజు సాంబశివరావు, తెలుగు టీచర్ బత్తుల నాగేశ్వరరావు, పూర్వ విద్యార్థులు ప్రస్తుత విద్యార్థులకు విశదీకరించారు. పూర్వ హెచ్‌ఎం ఆన్‌లైన్ ద్వారా పెశ్లూరు వెంకటేశ్వరరావు చక్కని సందేశంతో పాటు దీవెనలు అందజేశారు. పూర్వవిద్యార్థుల్లో వివిధ హోదాల్లో పని చేసిన రిటైర్డ్ హెచ్‌ఎంలు, టీచర్లు, మాజీ ఎంపీపీ వలేరు రాజారావు వంటి వారిని ఘనంగా సత్కరించి అభినందించుకున్నారు. కార్యక్రమంలో పుల్లగూర శ్యాంబాబు, జరుగుల శివరామకృష్ణ, పిల్లారి సీతారామరాజు, తులసి రామకృష్ణ, దప్పలపాడు మహేశ్వరరావు, తుమ్మలగుంట విజయ సామ్యూల్, అన్నలదాసు ఆనందరావు, గుత్తా కాళిదాస్, పాఠశాల ప్రస్తుత హెచ్‌ఎం ఉషశ్రీ, దావల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ సీఎంగా జగన్ రావాలని ప్రత్యేక పూజలు

పిడుగురాళ్ల: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా మళ్లీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రావాలని పిడుగురాళ్ల పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ 9వ వార్డు కౌన్సిలర్ మాదాల కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం శ్రీశైలంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, సీఎం కావాలని, అలాగే నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడిగా పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్, గురజాల ఎమ్మెల్యేగా కాసు మహేష్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందాలని ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు చెప్పారు. 2019 ఎన్నికల సమయంలో కూడా పిడుగురాళ్ల పట్టణంలో గంగమ్మ గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదాన కార్యక్రమాలు చేయటం జరిగిందని తెలిపారు. 2024లో కూడా జగనన్న అఖండ మెజార్టీతో గెలిచి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడుతుందని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం శ్రీశైలంలోని దేవాలయ ముఖ ద్వారం వద్ద వైఎస్సార్ సీపీ, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోలు ఉన్న సిద్ధం వాల్ పోస్టర్‌తో పాటు గురజాల నియోజకవర్గ అభివృద్ధి పత్రాలను ఈ సందర్భంగా విడుదల చేశారు. కార్యక్రమంలో కానాల శ్రీనివాస్‌రెడ్డి, గాదె అనంతరెడ్డి, చల్లా అంకిరెడ్డి, ఎం.రవికుమార్, బాణావత్తు రవికుమార్, వి.చంద్రశేఖర్‌రావు, కె.అనిల్‌కుమార్, ఎస్.రాఘవ్ పాల్గొన్నారు.



శ్రీశైలం శివాలయంలో పోస్టర్లను చూపిస్తున్న వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు

ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలి

రెంటచింతల: వర్షాల నేపథ్యంలో ప్రజలు ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎస్.రామ్ మోహన్‌రావు తెలిపారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బంగాళాఖాతంలో అల్పపీడనం వాయుగుండంగా బలపడే ప్రమాదం పొంచి ఉన్న నేపథ్యంలో మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించినట్లు చెప్పారు. గ్రామాలలో పాతకాలం నాటి మట్టిమిద్దెల గోడలు నాని పడిపోయే ప్రమాదం ఉందని దీంతో వెంటనే మట్టిమిద్దెలలో నివసించేవారు ఇల్లు విడిచి ఉండాలని సూచించారు. వర్షం కురుస్తూ ఉరుములు, మెరుపులు వస్తున్న సమయంలో చెట్లకిందకు వెళ్లవద్దని పేర్కొన్నారు. పొలాలలో ఉన్న విద్యుత్ మోటార్లు ఆన్ చేసే సమయంలో రైతులు చాలా జాగ్రత్తగా ఉండాలని కోరారు. ఇళ్లలోని కరెంట్ వైర్లు ఉన్న తడిచిన గోడలు, ఇంటి ముందు ఉన్న విద్యుత్ స్తంభాలను తొందరపాటులో ఎవరూ తాకవద్దని వాటికి ఎర్త్ వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సమావేశంలో డెప్యూటీ తహసీల్దార్ పిన్నం బ్రహ్మయ్య, ఆర్‌ఐ దాసరి కాంతారావు ఉన్నారు.